

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**షుమారుగా** ఆరేళ్ళు జరిగి పోయాయి, పై సంఘటన జరిగి. ఆనాటికీ ఈ నాటికీ ఊర్మిళకు స్పృహ రాలేదు. విజయవాడకు తరలించుక వెడతానన్నాడు రామచంద్రం. ఒద్దంది లలిత. ఆమె నర్సింగ్ హోంలోనే ఉంది ఊర్మిళ. రామానుజం, సీత భార్యాభర్తలుగా జీవిస్తున్నారు. అనసూయమ్మ చనిపోయింది. శ్రీనివాసాచారి ఎక్కడున్నాడో తెలీదు. సీత చెప్పినట్లుగానే తన మొదటి బాధ్యతగా మాలతినీ ఆమె పిల్లల్నీ ఆమె భర్త దగ్గరకు వెళ్లి తీరాలని గెంటేసింది.

సుభద్రమ్మ మంచంలో పడి వుంది.

సీతకీ మధ్య శరీరంలో అక్కడక్కడా దురద, పొక్కులు వస్తున్నాయి,

అవి కుష్టు చిహ్నాలని అనుమానంగా వుంది.

రామానుజం వెంటనే ఆమెను ఇంటి నుంచి గెంటేశాడు. నరసింహం విశాఖపట్టణానికి మార్పించుకుని మరో పెళ్లి చేసుకుని సుఖంగా వున్నాడు.

గోపాలరావు నార్త్ లోని వో ఆశ్రమంలో వున్నట్లు తెలిసింది. వివరాలన్నీ రాబట్టాడు రామచంద్రం.

వెంటనే అక్కడికి బయలుదేరింది కమల.

ఓ ఆశ్రమంలో సన్యాసం స్వీకరించి ప్రశాంతంగా కాలం గడుపుతున్నాడు గోపాలరావు,

‘”నన్ను క్షమించగలరా?” అంది కమల.

గోపాలరావు నవ్వాడు. “అది నా చేతుల్లో లేదు. నన్ను నేనే దైవం పాదాల మీద సమర్పణ చేసుకున్నాను. నువ్వొచ్చావు. నువ్వు తప్పు చేశావా లేదా అన్నది ఇపుడు చర్చ అనవసరం. నేను ఇప్పుడు గృహస్థాశ్రమంలో అడుగు పెట్టే ఆలోచనలో కూడా లేను. నువ్వు తప్పు చేయలేదనీ, చేయలేవనీ నా మనసుకు తెలుసు. కానీ ఒకానొక పరిధి దాటడమే తప్పు! ఆ తప్పు ఒక్కటే చాలు, కొన్ని అనవసరమైన అనుమానాలకి తావు ఇవ్వటానికి!

నువ్వు చైతన్య రాహిత్యస్థితిని చేరుకునే ముందుగానే నా మెదడూ ఓ రకంగా మొద్దుబారి పోయింది ఆ నాడు. నీకు రామచంద్రం వల్ల చైతన్యమూ, ఆత్మ విశ్వాసమూ వచ్చాయి. నాకీ ఆశ్రమ జీవితంలో హాయి కన్పిస్తోంది. నువ్వూ వుంటే వుండు. నాకు అభ్యంతరం లేదు. కానీ నా భార్యగా కాదు. ఆశ్రమంలోని అనేకానేక సేవికలలో ఒకర్తెగా. దూర దూర ప్రాంతాల నుంచి శాంతికి తపించి పోతూ వచ్చినవారిలో ఒకర్తెగా!

ఇక్కడ శాంతి లభ్యమౌతుంది. అయితే అది ఎవరూ ఇవ్వరు. మనకి మనం స్వయంకృషితో సాధించుకోవాలి. నిజానికి శాంతి అశాంతి అన్నవి ఎక్కడో లేవు కమలా. మనిషిలోనే, ఒకే నాణానికి బొమ్మా బొరుసుల్లా ఉంటాయని, అది తెలుసుకోగలిగితే, శాంతి సాధించగలిగితే ఇక ఈ సృష్టికి మూలం అవగతం అయినట్లే. దానికి ఎంతో సాధన కావాలి. ‘శాంతి’ తెలుసుకున్నాక, ఎవరి మీదా ప్రత్యేకమైన కోపం గానీ, ద్వేషం గానీ వుండవు.

నీకు రచనలు చేసే ఉత్సాహం వుంటే తప్పక వ్రాయి. ‘అహల్య’ కలం పేరుతో చనిపోయిన నీవు కమల పేరుతో పునరుజ్జీవనం సాధించు రచనలలో.

అయితే ఇన్ని అనుభవాలు, అనుభూతుల తర్వాత పరిణితి చెందిన నీ హృదయం నుంచి సమాజ శ్రేయస్సుకు ఉపకరించే రచనలు వెలువడేలా జాగ్రత్తపడు. అదొక్కటే నేను నీకిచ్చే సలహా” అన్నాడు గోపాలరావు చివరగా.

కమల పట్ల జాలి, సానుభూతి వుంది అతగాడికి. కానీ ఆనాడు ముక్కచెక్కలైన హృదయంలో నుంచి ఓ విధమైన వైరాగ్యం, జీవితం పట్ల అనాసక్తత వచ్చేసాయి. ఈ ఆశ్రమంలో తనని తాను సాధనలో మలచుకొని, తన తోటి వారెందరికో సేవలు చేయటంలో ఓ విధమైన శాంతిని పొందుతున్నాడు అతగాడు.

కమల పై విషయాలన్నీ డాక్టర్ రామచంద్రంకు వ్రాసింది. అక్కడే వుండి పోయింది. ఆ ఆశ్రమంలో వారిద్దరూ ఒకప్పటి భార్యాభర్తలు కారు. నిస్వార్ధ సేవకులు మాత్రమే.

ఇవేవీ ఊర్మిళకు తెలియవు, ఆమె కోమాలోనే వుంది ఆమెలో ఎప్పుడు తిరిగి చైతన్యం వస్తుందో ఎవరూ ఊహించ లేకుండా వున్నారు.

విదేశీ డాక్టర్ల బృందాలెన్నో వచ్చి పరిశీలించాయి. ఈ స్థితిని తమ తమ వైద్య పరిజ్ఞానంతో విశ్లేషణ చేస్తూ వ్యాసాలూ ప్రకటించాయి. ఆ వ్యాసాల సారాంశం అన్నిపత్రికలలోనూ వచ్చింది. అమెరికన్ వైద్య పరిశోధన సంస్థ ఒకటి "ప్రపంచ ఆరోగ్య సంస్థ" తరపున ఊర్మిళను పరిశోధించింది, తమ దేశానికి ఆమెను తరలించి, పరిశోధనలు కొనసాగిస్తామని భారత ప్రభుత్వాన్ని కోరింది.

ఊర్మిళ భర్త రామానుజం అనుమతి తీసుకుని భారత ప్రభుత్వం తమ అంగీకారం తెలిపింది. రామానుజం అంగీకరించాడు ఆమెను విదేశానికి తరలించడానికి. అందుకు అతగాడికి డబ్బు ఘనంగానే ముట్టింది ఆ ప్రభుత్వం తరపున.

భారత దేశం నుంచి అనుమతి లభించింది కాబట్టి అమెరికన్ వైద్య బృందం (మిగతా దేశస్థులైన డాక్టర్లు తమ బృందంలోనూ వున్నారు కాబట్టి) ఊర్మిళను విమానంలో తమ దేశం తరలించే ఏర్పాట్లలో వుంది.

"మేడం!"

త్రుళ్ళి పడింది డాక్టర్ లలిత.

లలితా నర్సింగ్ హోంలోని పదహారో నెంబరు గది అది. గది అతి విశాలంగానూ అధునాతనంగానూ వుంది. లలితకు పేషంట్లందరినీ చూడటం పూర్తయ్యాక ఈ గదిలోకి వచ్చి ఇలా ఈజీచేర్ లో కూర్చుని రిలాక్స్ కావటం అలవాటయ్యింది. తన ప్రాణస్నేహితురాలు ఊర్మిళ చిత్తు చిత్తుగా వ్రాసిన నవల తాలూకు కాగితాలు చదువుతోందామే అందాకా.

నర్స్ మేరీ పిలుపుతో త్రుళ్ళిపడింది.

"ఫారిన్ డాక్టర్స్ బృందంలోని హెడ్ డాక్టర్ ఉడ్స్ మీకు ఫోను చేసారు."

"పద వస్తున్నా." చేతిలోని కాగితాలు టేబుల్ మీద పెట్టి పేపర్ వెయిట్ పెట్టి, తన రూంలోకి వచ్చి ఫోన్ రిసీవ్ చేసుకుంది డాక్టర్ లలిత.

"హలో డాక్టర్ లలితా! సాయంత్రం సరిగ్గా నాలుగ్గంటలకి మీ నర్శింగ్ హోంకు వస్తాము. అవసరమైన గవర్నమెంటు అగ్రిమెంట్లు, కాగితాలూ అన్నీ తెస్తున్నాము. మీ పేషెంటును రెడీగా వుంచండి. ఆమె భర్తగారిని పిలిపించి వుంచండి. అవసరమైన సంతకాలు చేయాలి ఆ పెద్ద మనిషి" అన్నాడు ఉడ్సు.

"అలాగే" అంది లలిత ఫోను పెట్టేస్తూ, ఆమెకి దుఖం పెల్లుబికి వస్తోందెందుకో ఒక్కసారిగా.

లాయరు రాజు వచ్చాడు అప్పుడే ఆ గదిలోకి.

అతగాడి గుండెలకి తల ఆనించి పెద్దగా ఏడ్చింది లలిత.

"ధైర్యం తెచ్చుకో." అతగాడు అనగలిగిందీ, అనవలసిందీ ఆ మాటే. అతగాడికీ చాలా బాధగా వుంది.

"ఊర్మిళకి ఎలా ఉంది? ఎనీ ప్రోగ్రెస్?" అన్నాడు ఆమె వెన్ను మృదువుగా రాస్తూ.

"ఊహుఁ! సాయంత్రం ఫారిన్ డాక్టర్స్ బృందం వస్తున్నారు."

"కోర్టులో ఓ రెండు కేసులు ఆర్గ్యుమెంటు వుంది. అది ముగించుకుని సాయంత్రం వాళ్ళు వచ్చేలోగా ఇంటికి వచ్చేస్తాను. నువ్వో డాక్టరువి. ఎందఱో పేషెంట్లు ఎన్నో బాధలతో వ్యాధులతో నీ దగ్గరికి వస్తుంటారు. కొన్ని కేసులు సక్సెస్ అవుతాయి. మరికొన్ని ఇలా ట్రాజెడీ ఎండ్ తో బాధిస్తాయి. రెంటికీ సిద్ధంగా వుండాలి నేనైనా అంతే కదా! న్యాయం నా క్లయింట్ వేపుందని తెలిసీ వాదించీ ఆ కేసు సక్సెస్ కానపుడు... జడ్జిమెంటులో లోపం జరిగి ఆ క్లయింట్ కు అన్యాయం జరిగినపుడు ఇప్పుడు నీలానే తల్లడిల్లి పోతుంటాను, లాయరుగా. ఆఁ! నాకు కోర్టుకి టైమవుతోంది. వెళ్లిరానా?" అన్నాడు రాజు.

"వెళ్ళిరండి. వీలయినంత త్వరగా వచ్చెయ్ రాజూ" అంది లలిత.

"అలాగే." అతగాడు కారులో వెళ్ళిపోయాడు.

మరలా పదహారో నంబరు రూంలోకి వచ్చింది డాక్టర్ లలిత. ఓ మూలగా కిటికీ పక్కన పెద్ద మంచం... బెడ్. దానిమీద ఊర్మిళ పడుకుని వుంది, నిశ్చలంగా నిద్రలో వున్నదానిలా.

వైద్య ప్రక్రియలో అతి ప్రగతి సాధించిన ఈ రోజులలో ఆమెకి రబ్బరు గొట్టం ద్వారా ఒక్కోసారి ముక్కులలో నుంచి అన్నవాహికలోనికి పాలు, పళ్ళరసం లాటిది సరఫరా చేయబడుతోంది. ఒక్కోసారి రక్తనాళానికి ఇంజెక్ట్ చేయబడి సరఫరా చేయబడుతోంది. ఆమె కాలకృత్యాలకూ విడివిడిగా గొట్టాలు అమర్చబడి వున్నాయి.

ఊర్మిళ శ్వాసిస్తోంది. శ్వాస ప్రక్రియ యధాతధంగా జరుగుతోంది. ఎప్పుడో ఒక్కోసారి ఆమె కనురెప్పలు విడివడతాయి. క్షణ కాలం కళ్ళు చూస్తాయి. కానీ ఆ ఛూపు ఈ లోకానికి సంబంధించినదిగా వుండదు. ఏ సుదూర లోకాలలో చిక్కుబడి పోయిందో ఆ దృష్టి. మరుక్షణం రెప్పలు మూతబడతాయి. అలాగే అప్రయత్నంగా ఆమె పెదవులు విడివడి చిరునవ్వు వెలువడుతుంది. అదీ క్షణకాలమే! ఆమె నాడీ మండలం అంతా సవ్యంగా వుంది.

కానీ ఈ లోకానికి సంబంధించిన చైతన్యం కోల్పోయింది ఆమె మెదడూ, శరీరమూ. ఆమె కోమాలో వుంది. ఒక రోజా... రెండు రోజులా? కాదు ... మూడు సంవత్సరాల నుంచీ. ఇండియన్ డాక్టర్లు ఎందఱో వచ్చి చూశారు. ఫారిన్ రిటర్న్ డాక్టర్లు వచ్చారు, చూసారు. ఇలాటి కేసులున్నాయి.

వీటికి పరిష్కారం ఎప్పుడు? ఎలా?

ఇలాటి పేషంట్లను ఇలా కాపాడుతూ ఉండవలసిందే. విధి లేదు. డాక్టర్ లలిత ఊర్మిళ బెడ్ దగ్గరగా నడిచి ఊర్మిళ కేసి తదేకంగా చూస్తోంది.

ఆమెకి కన్నీళ్లు పొంగి వస్తున్నాయి. తానీ ఊర్మిళకి ప్రాణస్నేహితురాలు. కాబట్టే ఈ కోమా స్థితిలో యింత జాగ్రతగా కాపాడుకొని వస్తోంది ఈ మూడేళ్ళుగా.

ఈ రోజు సాయంత్రం ఫారిన్ డాక్టర్స్ బృందం వస్తారు. వాళ్ళు ఊర్మిళను తీసుకు వెళ్తారు. అందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ జరిగి పోయాయి.

ఊర్మిళకు ఈ కోమా యెప్పుడు వదులుతుంది? ఈ చైతన్య రాహిత్య స్థితి నుండి ఊర్మిళ యెప్పుడు బయటపడుతుంది? ఆరు, పది, ఇరవై, వంద, వెయ్యి ... ఎన్ని సంవత్సరాలయినా పట్టవచ్చు.

అప్పుడామెకి మెలకువ... చైతన్య స్థితి వస్తుంది.

ఈ స్నేహితురాలు లలితగానీ, ఈ వాతావరణం గానీ ఏవీ వుండవప్పుడు. పరాయి దేశంలో, కళ్ళు విచ్చి పరిసరాల్ని గురించి, జ్ఞాపక తెరల్ని చీల్చుకుని ఊర్మిళ ఏం పలుకుతుందప్పుడు?

ఆ తరం వారికి ఆమె ఓ అద్భుతం. ఆమె చెప్పే 'గత విషయాలు' మరీ అద్భుతం అనిపిస్తాయి. "వెయ్యి సంవత్సరాల క్రితం ఒన్స్ అపాన్ ఎ టైం... భారత దేశంలో నేను పుట్టి పెరిగి..." ఇలా ప్రారంభిస్తుంది ఊర్మిళ తన కథని. ఆ తరం శ్రోతలు దిగ్భ్రాంతి పొందుతూ వింటారు. భావుకులయిన యువ రచయితలూ, రచయిత్రులూ వారిలో వుంటారు కదా! వారీ ఊర్మిళ కథని రకరకాల ఊహాగానాలతో తమదైన శైలితో, శిల్పంతో అద్భుత నవలలుగా, కథలుగా, వ్యాసాలుగా మలుస్తారు. అశేష పాఠకులు అవి చదువుతారు. డబ్బెక్కువగా వున్నవారు ఊర్మిళ వున్న హాస్పిటల్ ను వెతుక్కుంటూ వచ్చి చూచి వెళతారాయెను. ఆటోగ్రాఫ్స్ తీసుకుంటారు.

ఈ ఊర్మిళ ఒకప్పటి రామాయణ కాలంలోని 'ఊర్మిళ' పాత్ర గురించి తీవ్రంగా ఆలోచించి ప్రభావితురాలయింది. నవల వ్రాయాలని సంకల్పించింది. కొంత కొంత వ్రాసింది. ఎంచేతో అది ఆగిపోయింది. ఆమె చైతన్య స్థితిని కొద్ది కొద్దిగా కోల్పోతూ, చివరకు యీ చైతన్య రాహిత్య స్థితిలో పడిపోయింది. ఈ ఊర్మిళ కథ కూడా యువ రచయితలకూ వెయ్యి ఏళ్ల తరువాత ఇన్స్పిరేషన్ కలిగించవచ్చు.

"ఊర్మిళా! నీలో స్త్రీత్వం ముగ్ధరూపంలో వికసించి వుండేది. అది ఏమైంది? భగవంతుడు ఉన్నాడన్న అపార విశ్వాసం నీలో ధృడంగా వుంది. ఒకవేళ నీవు తరచుగా చెబుతుండిన సమాధి స్థితా ఇది?

నీలో గొప్ప రచయిత్రి కాదగిన ఊహలూ, భావావేశమూ పుష్కలంగా ఉండేవి. అందుకు ఋజువుగా నీ స్వహస్తాలతో నీ భావుకతతో కొంత కొంతగా వ్రాసిన ఈ 'ఊర్మిళ' ప్రతి వుంది.

కానీ ఆ చైతన్యం యేమయి పోయింది? ఈ రాహిత్య స్థితి ఎలా సంభవించింది? దీనికి వైద్య పరంగా పేరు నిర్ణయించగలమే గానీ, దీనికి మూలం తెలుసుకోలేకుండా వున్నాం. నీ ఊహల ప్రకారం రామాయణ కాలం నాటి ఊర్మిళ మరలా ఉద్భవించాకే, నీలో ఈ చైతన్య రాహిత్యం వదిలి ఆమెతో నీ సమావేశమూ, సంభాషణా జరుగుతాయా? ఏమో?"

లలిత పిచ్చిగా ఊర్మిళను నిమురుతోంది. పదే పదే ఆమె వ్రాసిన కాగితాలు చదువుతోంది.

అయితే ఊర్మిళ ఈ చైతన్యరాహిత్య స్థితికి ముందు కథ చాలా వుందని ఆమెకి తెలుసు. ఆ కథలో తన పాత్ర ఎక్కువ ప్రాధాన్యత కలిగింది కాకపోయినా, తన భావనా పరిధి మేరకు ఆమె కథను ఊహిస్తోంది. దృశ్యాలుగా చూస్తోంది. ఆమె వ్రాస్తూ వదిలి వేసిన 'ఊర్మిళ' కథని తానైనా పూర్తి చేయాలనే ఆలోచనలో ఈ ఊర్మిళ తాలూకు గత జీవితాన్నంతా ఆమె మనసు తిరగ వేస్తోంది.

ఏర్ పోర్టులో ఊర్మిళని అన్ని జాగ్రత్త అయిన ఏర్పాట్లతో ఆమెకై ప్రత్యేకంగా రూపొందించిన వో తీగెల పెట్టెలో కంఫర్టబుల్గా పడుకోబెట్టి డాకర్ల బృందం విమానంలోకి తరలించారు.

లాంఛనంగా రామానుజం కూడా ఏర్ పోర్టుకు వచ్చాడు. విమానం గాలిలోకి లేచింది.

"ఊర్మిళా! నీకెప్పుడు చైతన్యం వస్తోందో... అసలు వస్తుందో రాదో... వచ్చేసరికి ఈ వాతావరణంలో ఎన్ని మార్పులు వచ్చి ఉంటాయో? ఏ తరం జరుగుతుంటుందో ?"

ఆవేదనగా అనుకున్నారు డాక్టర్ లలిత, డాక్టర్ రామచంద్రం వెనుదిరుగుతూ.

(సమాప్తం)

Post your comments